క్లుప్తంగా

కూటమితో విద్యారంగం నిర్వీర్యం



సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతుంది. అధికారంలోకి వస్తే విద్యారంగానికి పెద్దపీట వేస్తామని ఇప్పుడు ఆ రంగాన్ని నిర్వీర్యం చేస్తుంది. రూ.3,900 కోట్లు ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉంటే రూ.700 కోట్లు మాత్రమే విదిల్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక పోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. యువతకు అన్నివిధాలా అండగా ఉండేందుకే వైఎస్సార్ సీపీ యువత పోరు చేపడుతోంది.

–డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, సత్తెనపల్లి

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



నకరికల్లు: మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో వీరాంజనేయస్వామి తిరునాళ్ల వేడుకల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు. సోమవారం రాత్రి గ్రామానికి వచ్చిన ఆయన ఆలయంలోని స్వామివారిని దర్శించుకొని విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభల వద్దకు వెళ్లి ప్రజలకు అభివాదం చేశారు. తిరునాళ్ల శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట

క్రోసూరు: క్రోసూరులో బుధవారం జరగనున్న అభయాంజనేయ స్వామి 32 అడుగుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా గత రెండు రోజులుగా జరుగుతున్న పూజా కార్యక్రమాలు మంగళవారం కొనసాగాయి. పుణ్య దంపతులు పాల్గొని హోమాలు నిర్వహించారు. నవగ్రహాలను, దేవీ దేవతలను ప్రసన్నం చేసుకొనేందుకు, ఆవాహనం చేసుకొనేందుకు సంబంధించిన యజ్ఞ యాగాలు నిర్వహించారు. ఈ యజ్ఞాలలో క్రోసూరు, ఎర్రబాలెం గ్రామాలకు చెందిన పలువురు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి 32 అంగుళాల రాతి విగ్రహాన్ని శుద్ధిచేసి, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. తదుపరి పీఠాధిపతులైన రుద్ర యోగేశ్వరస్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకై అహర్నిశలు కృషి చేసిన గ్రామ పెద్ద కాంద్రు కాశయ్యను ఆలయ కమిటీ, భక్తులు సన్మానించారు.

350 పశువులకు వ్యాక్సినేషన్



క్రోసూరు: మండలంలోని అందుకూరు, అనంతవరం గ్రామాల్లో మంగళవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించినట్లు మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. రెండు గ్రామాల్లో మొత్తం 350 పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు, బ్రూసెల్లోసిస్ నివారణ వ్యాక్సిన్లు వేసినట్లు చెప్పారు. ఈనెల 31 వరకు జరిగే శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రలు, పాల్గొన్నారు.

విక్రయ హక్కులకు వేలం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్‌రోడ్ వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పరిధిలోని దుకాణాలలో విక్రయహక్కులకై మంగళవారం వేలం నిర్వహించినట్లు మండల దేవాలయ శాఖ ఈఓ అవుదూరి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను హక్కుకు రూ.1,03,000, క్యాంటిన్, కూల్ డ్రింక్స్ విక్రయాలకు రూ.1,03,000, ప్రసాదాలు విక్రయించుకునే హక్కుకై రూ.50,000 లకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ మూడింటిపై రూ. 2,56,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యములు అమ్ముకునే హక్కు, చిత్రపటాలు అమ్ముకునే హక్కు, తలనీలాలు పోగు చేసుకునే హక్కులకు వేలంలో పాల్గొనేందుకు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి దేవదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ వి.లీలావతి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి దారుణం..

గృహం అధ్వానం

- అద్దె భవనాల్లో కునారిల్లుతున్న బీసీ హాస్టళ్లు
- క్రోసూరు మండలంలో మూడు హాస్టళ్లు
- వాటిలో రెండు అద్దె భవనాల్లోనే ..
- రూ.వేలల్లో అద్దె.. వసతులు శూన్యం
- చాలినన్ని మరుగుదొడ్లు, గదులకు తలుపులు లేని దుస్థితి



వసతులు కరువైన కళాశాల విద్యార్థుల వసతి గృహం



దొడ్లేరు వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులు

క్రోసూరు: మండలంలోని బీసీ సంక్షేమ వసతి గృహాలు సొంత భవనాలు లేక రూ.వేలకు వేలు అద్దెచెల్లించుకుంటూ అరకొర వసతుల మధ్య నిర్వహణ జరుగుతున్నాయి. క్రోసూరు మండలంలో మూడు బీసీ సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటిలో క్రోసూరులో రెండు, దొడ్లేరులో ఒకటి ఉన్నాయి. క్రోసూరులో బీసీ పాఠశాల బాలుర వసతి గృహంలో 80 మంది విద్యార్థులు, కళాశాల వసతి గృహంలో 26 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇవి రెండూ అద్దె భవనాలే. దొడ్లేరులోని పాఠశాల బీసీ విద్యార్థుల వసతి గృహం మాత్రమే సొంత భవనంలో నడుస్తుంది. దీనిలో 60 మంది విద్యార్థులు చదువులు చదువుకుంటున్నారు. మొత్తం 166 మంది బీసీ విద్యార్థులు హాస్టళ్లలో చదువులు కొనసాగిస్తున్నారు.

రూ.వేలల్లో అద్దె.. సౌకర్యాలు నిల్

క్రోసూరులోని కళాశాల విద్యార్థుల వసతి గృహం అద్దె నెలకు రూ.49 వేలు, కాగా పాఠశాల విద్యార్థుల వసతి గృహానికి రూ.37 వేల అద్దెలను ప్రభుత్వం ప్రతి నెలా చెల్లిస్తుంది. పాఠశాల బీసీ హాస్టల్‌కు సుమారుగా 20 సంవత్సరాలుగా, కళాశాల హాస్టల్‌కు 14 సంవత్సరాలుగా అద్దెలు చెల్లిస్తోంది. ఈ రెండు హాస్టళ్లు సొంత భవనాల్లో సాగకపోవడంతో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తలుపులు సక్రమంగా లేని గదులు, చాలినన్ని లేని టాయిలెట్లు, బాత్‌రూములు లేక తీవ్ర ఇక్కట్ల మధ్యే విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. మెనూ ప్రకారం భోజనాలు అందించినా మినరల్ వాటర్ కొనుగోలు చేసుకోవాల్సిందే.

తాగేందుకు నీళ్లు లేవు



పాఠశాల విద్యార్థులు క్రోసూరు హాస్టల్‌లో 80 మంది ఉన్నారు. ఇక్కడ తాగేందుకు నీళ్లు లేవు. మినరల్ వాటర్ ప్లాంట్ అవసరం ఉంది. భోజనం చేసే ప్రతీసారి నీళ్లు కొనుగోలు చేస్తున్నాం.

– జి.చిన్నా, క్రోసూరు జెడ్పీ పాఠశాల విద్యార్థి, క్రోసూరు

తలుపులు కూడా సక్రమంగా లేవు



కళాశాల విద్యార్థుల వసతి గృహానికి తలుపులు కూడా సక్రమంగా లేవు. చాలినన్ని టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు లేవు. దోమలు విపరీతంగా ఉంటున్నాయి. హాస్టల్‌లో వసతి సక్రమంగా లేదనే పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌లో క్రోసూరు లో చేరేందుకు విద్యార్థులు ఇష్టపడటం లేదు.

– బి.దిలీప్ నాయక్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి, క్రోసూరు

‘బార్’ ఎన్నికల్లోనూ రాజకీయం!

సత్తెనపల్లి: బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సైతం రాజకీయాలు ప్రవేశించాయి. అధికార పార్టీ ఏకంగా బార్ అసోసియేషన్‌లోనూ తమదే పైచేయి ఉండాలంటూ ఆధిపత్యాన్ని ప్రదర్శించబోతుంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో న్యాయవాది మద్దినేని వెంకట చలపతిరావు నేతృత్వంలో టీడీపీ లీగల్ సెల్ కమిటీని ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరానికి కార్యవర్గ ఎన్నిక విషయాన్ని నియోజకవర్గ ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లగా లీగల్ సెల్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకుని ఆ ప్రకారం నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. దీంతో టీడీపీ లీగల్ సెల్ కమిటీకి సంబంధించిన సుమారు 20 మందికి పైగా న్యాయవాదులు ఇటీవల పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల ఎన్టీఆర్ భవన్‌లో సమావేశమై సత్తెనపల్లి బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరానికి నిర్వహించాల్సిన ఎన్నికలపై చర్చించారు. అధ్యక్షుడిగా గంగూరి అజయ్‌కుమార్ పేరు ప్రకటించటంతో అప్పటికే అధికార పార్టీకి చెందిన మరో న్యాయవాది సర్వేపల్లి సీతా రామాంజనేయులు తనకు గతంలో అధ్యక్ష పదవి ఇస్తామనే హామీని సమావేశం దృష్టికి తీసుకురాగా ఈ పర్యాయం కూడా అవకాశం లేదని తేల్చి చెప్పి ఆయన్ను బుజ్జగించారు.

- ఈ నెల 27న సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగాల్సి ఉండడంతో మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ అధ్యక్షతన అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి నియామకం విషయం కూడా ఏకపక్షంగానే జరిగిందనే విమర్శలు బయటికి వచ్చాయి. మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు ప్రధాన ఎన్నికల అధికారి నియామకం జరగాల్సి ఉన్నప్పటికీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న కంబాల అనిల్‌కుమార్ ప్రధాన ఎన్నికల అధికారిగా టీడీపీ లీగ్ సెల్ మెంబర్ అయిన సీనియర్ న్యాయవాది గుజ్జర్లపూడి మార్కురావు పేరును ప్రపోజ్ చేశారు. దీనికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ మరో న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ ప్రధాన ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాదులు చిలుకా చంద్రశేఖర్, కన్నెధార హనుమయ్య పేర్లను ప్రపోజ్ చేశారు. సీనియర్ న్యాయవాదులు దాసరి జ్ఞానరాజ్‌పాల్, అంకాళ్ల వెంకటేశ్వర్లు సైతం ప్రధాన ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది అయిన చిలుకా చంద్ర శేఖర్ పేరును ప్రస్తావించగా వాటిని ఏమాత్రం పరిగణంలోకి తీసుకోలేదు. సమావేశం తీరు వ్యవహారం మొత్తం టీడీపీ లీగల్‌సెల్ కమిటీ కనుసన్నల్లోనే జరుగుతుందనే అంచనాకు కొందరు న్యాయవాదులు వచ్చారు. దీంతో ఎన్నికలను ఒక వర్గం న్యాయవాదులు బాయ్‌కాట్ చేయాలనే ఆలోచనతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చర్చ జరుగుతుంది.

ఎన్నికల ప్రధాన అధికారిగా మార్కురావు



సత్తెనపల్లి: బార్ అసోసియేషన్ ఎన్నికలకు ప్రధాన ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది గుజ్జర్లపూడి మార్కురావు నియమితులయ్యారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరానికి ఎన్నికల నిర్వహణకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ అధ్యక్షతన సోమవారం సత్తెనపల్లి బార్ అసోసియేషన్ సభ్యుల అత్యవసర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలు ప్రకటించామని, ఎన్నికల షెడ్యూల్, నియమ నిబంధనలు విడుదల చేస్తామని ప్రధాన ఎన్నికల అధికారి మార్కురావు తెలిపారు. ఏపీ బార్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరుగుతాయన్నారు. సహాయ ఎన్నికల అధికారిగా న్యాయవాది నల్లిబోయిన ఆంజనేయులు వ్యవహరిస్తారని మార్కురావు తెలిపారు.

గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలి

తొండపి(ముప్పాళ్ళ): రైతులు రైతు గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని తొండపి, రుద్రవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ అరుణ మాట్లాడుతూ 11 అంకెల గుర్తింపు సంఖ్య కొరకు ఆధార్‌కార్డు, సర్వే నెంబర్, మొబైల్ ఫోన్ తీసుకొని గ్రామ వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రుణసాయం లాంటి సంక్షేమ పథకాలు అందాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసి ఉండాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం




విత్తన గుళికలు తయారుచేసే విధానాన్ని చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

దొడ్లేరు(కోసూరు): రైతులు ప్రకృతి వ్యవసాయబాటలోనే ముందుకు సాగాల్సిన అవసరం ఉందని క్రోసూరు ఏడీఏ హనుమంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని దొడ్లేరు గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలు, సెర్ప్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ శాఖల మండలం స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అధ్యక్షతన నిర్వహించగా క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కె.హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. రాబోయే ఖరీఫ్‌కు ముందు ప్రతి ఒక్క రైతు తన పొలం లో పీఎండీఎస్(నవ ధాన్య విత్తనాలు)చల్లాలని సూచించారు. అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ రైతులు పీఎండీఎస్ విధానం ఆచరించాలన్నారు. మండల ఏఓ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి రైతు అంతర పంటల విధానం ఆచరించాలని వీటి వలన చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో నవధాన్య సాగు చేసి ఉత్తమ ఫలితాలు సాధించిన ఆదాం అనే రైతుకు బెస్ట్ ఫార్మర్ అవార్డుతో సత్కరించారు. అనంతరం వేసవిలో కూడా విత్తనాలు మొలకెత్తడానికి వీలుగా విత్తన గుళికల విధానం ఎలా చేయాలో ప్రదర్శన చేసి చూపించారు. మండల ఏపీఎం కృపావేణి, హార్టికల్చర్ అసిస్టెంట్, మండల సీసీలు, జిల్లా సిబ్బంది అప్పలరాజు, డివిజన్ మాస్టర్ ట్రైనర్ జయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ వెలుగు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాపుసారా విక్రయాలు నిషేధం

ఈఎస్‌టీఎఫ్ సీఐ శ్రీనివాసమూర్తి



తాడువాయిలో మాట్లాడుతున్న ఈఎస్‌టీఎఫ్ సీఐ శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి

అచ్చంపేట: రహస్య స్థావరాలలో బట్టీలు పెట్టి సారా కాసినా, కాసిన సారాను విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈఎస్‌టీఎఫ్ సీఐ శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడువాయి, తాడువాయి తండాలలో ఎక్సైజ్ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నాటుసారా కాసినా, విక్రయించినా నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. దొంగతనంగా అడవులలో బట్టీలు ఏర్పాటు చేసి సారా కాయడం నేరమన్నారు. అలా కాసిన సారా తాగడం వల్ల అనారోగ్యం పాలవుతారన్నారు. సారాకు బానిసల వ్వవద్దని, నిండు జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు చెప్పారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు



జూనియర్స్ విభాగంలో రసవత్తరంగా జరుగుతున్న పోటీలు

రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరంలో వేంచేసి ఉన్నశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి 96వ జయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. మంగళవారం సేద్యం విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి అత్తోట శిరీష, శివకృష్ణ చౌదరిలకు చెందిన ఎడ్ల జత 4000 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కై వసం చేసుకున్నాయి. గుంటూరుజిల్లా పెదకాకాని కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్ల జత 3926 అడుగుల దూరంలాగి ద్వితీయ స్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 3893ల అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన పుట్టా తిరుపతయ్య ఎడ్ల జత 3845 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానం, గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సరిపూడి, గుంటూరు చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, సోమిశెట్టి ఆంజనేయులకు చెందిన ఎడ్లజతల 3337 అడుగుల దూరం లాగి ఐదవ స్థానం సాధించారు.

- జూనియర్స్ విభాగంలో ఎడ్లజత పందేలు రసవత్తరంగా జరిగాయి. హైదరాబాద్‌కు జిల్లాలకు చెందిన ఆర్‌ఆర్ బుల్స్‌సామ్రాట్ బసవ, మొండి జగమొండి డి.రోహన్‌బాబుకు చెందిన ఎడ్ల జత 2962 అడుగుల దూరం లాగి ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి అత్తోట శిరీష, శివకృష్ణ చౌదరులకు చెందిన ఎడ్ల జత 2759 అడుగుల దూరం లాగి మూడవ స్థానం, గుంటూరుజిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన ఆళ్ల మోహన్‌రావు, పాటిబండ్ల శ్రీనివాసరావుల ఎడ్ల జత 2478 అడుగుల దూరంలాగి నాల్గవ స్థానం , పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిమర్రు గ్రామానికి చెందిన యర్రసాని సుబ్బయ్య ఎడ్ల జత 2000 అడుగుల దూరం లాగి ఐదవ స్థానం సాధించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.నేడు సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగునని తెలిపారు.

‘యువత పోరు’ విజయవంతం చేద్దాం

- యువత పెద్ద ఎత్తున తరలిరావాలి
- వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి



నకరికల్లులో యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, నాయకులు

నకరికల్లు: విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. యువతపోరు పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవిధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు భృతి ఇవ్వాలని, కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ యత్నాలు ఉపసంహరించుకోవాలని, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జక్కిరెడ్డి కోటిరెడ్డి, రేమిడిచర్ల కాశీ, అంజిరెడ్డి, షేక్. హుస్సేన్‌బి సలీల్, కొత్తపల్లి ప్రసాద్, పరసా సాంబయ్య, మైనారిటీ విభాగం దావూద్, రుసుం శ్రీనివాసరావు, కంఠమనేని చందు, మద్దం సురేష్, కోవూరి నరసయ్య, పానాది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం చేపట్టే పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అందరూ తరలిరావాలని భవనం రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

యువతపోరుకు తరలిరండి

అమరావతి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే యువతపోరుకు యువత పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమం తరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం తొలుత వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం జిల్లా కేంద్రమైన నర్సారావుపేటలో నిర్వహించే యువతపోరుకు తరలివెళతామన్నారు. యువత, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.



ముప్పాళ్ళలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అచ్చంపేట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఏర్పడి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం జరిగే ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించి మండల నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు హాజరుకావలసిందిగా పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఉదయం 9 గంటలకు పార్టీ జెండావిష్కరణ, కేక్ కటింగ్ ఉంటుందన్నారు. అదేవిధంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో జరిగే ధర్నాకు మండల పార్టీ శ్రేణులు తరలి రావలసినదిగా కోరారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: విద్యార్థుల భవిష్యత్ కోసం నేడు నరసరావుపేటలో తలపెట్టిన యువతపోరును జయప్రదం చేయాలని మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కొండమోడులో వైఎస్సార్ సీపీ నాయకులు యువత పోరు పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, నాయకులు బాసు లింగారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, హరి నాగేశ్వరరావు, తోట రఘునాథ్, ప్రత్తిపాటి కోటేశ్వరరావు, బూదాటి సీతారాములు, ఎస్‌కె సుభానీ, గన్నుపల్లి బుల్లిబాబు, వేపూరి సోమశేఖర్,తదితరులు ఉన్నారు.

ముప్పాళ్లలో..

ముప్పాళ్ళ: కూటమి ప్రభుత్వంలో మోసపోతున్న విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తూ ఈ నెల 12వ తేదీన వైఎస్సార్ సీపీ చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. నరసరావుపేటలో ఉదయం 10గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ మధిర రామకృష్ణారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్.కే.ఖాశిం, జానీబాషా, చావా రమేష్, గంజి శ్రీనివాసరావు, కళ్ళం శివరామిరెడ్డి, కనకం, జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాదలలో ప్రత్యేక వైద్య శిబిరం



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన బెల్లం మహాలక్ష్మమ్మ అనే మహిళ జ్వర లక్షణాలతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ మేర గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యులతో వైద్యాధికారి జయకృష్ణ ప్రవీణ్, హెల్త్ సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, ఎం.జోస్పిన్‌రాణిలు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలోని మురుగు కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. అలాగే ఇళ్లలోను, ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. రక్త నమూనాలు సేకరించి అవసరమైన వారికి మందులను అందించారు. గ్రామంలో ఫాగింగ్ చేయించారు.

విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు

యడ్లపాడు: గుంటూరు జిల్లా విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 13న గురువారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక విజయవాడ ఆధ్వర్యంలో ప్రత్యేక న్యాయ సదస్సు నిర్వహించనున్నారు. చిలకలూరిపేటలోని సుబ్బయ్య తోట 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఈ సమావేశం జరుగనుంది. ఈ సదస్సుకు విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎస్. విక్టర్ ఇమ్మానుయేల్ (చైర్మన్, విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక, విజయవాడ), సాంకేతిక సభ్యుడు కే. వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యుడు ఆర్. సి. హెచ్. శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఏ. సునీత హాజరవుతారన్నారు.

భక్తిశ్రద్ధలతో శతచండీ మహాయాగం

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్ఠా బ్రహ్మ, దేవి ఉపాసకులు, విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య హనుమత్‌స్వామి వారి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం మంగళవారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. చండీ పారాయణం, శత చండీ హోమం, గురువందనం, ప్రధాన దేవతార్చణ, శత చండీహోమం, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. రామతారక మంత్ర హోమం, ఆంజనేయ హోమం, సుబ్రహ్మణ్య హోమం, క్షేత్రపాలక మండప దేవతా హోమంలు నిర్వహించారు.